ఓటర్ల జాబితా సవరణపై పారదర్శక విచారణ

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలో భాగంగా రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధుల నుండి అందిన ఫిర్యాదులపై విచారణ పారదర్శకంగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. ఈ నెల 26వ తేదీలోపు విచారణ చేసి పరిష్కరించి జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. ఇవిఎంలను ఏ విధంగా ఉపయోగించాలి, ఓటింగ్ విధానంపై అవగాహన చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కోడే యుగంధర్, మరపట్ల శ్యాంబాబు, తమలంపూడి వంశీ శ్రీనివాసరెడ్డి, కాటూరి కరుణాకర్, జెఎస్‌వి.గోపాలన్, ఎన్నికల తహశీల్దార్ వై.దుర్గాకిశోర్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆఖరి శ్వాస వరకూ ప్రజా పోరాటాల్లోనే

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతితో శోకసంద్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు

ఉపాధ్యాయ సంఘం నేతగా 30 ఏళ్లు ఎనలేని సేవలు

ఎంఎల్‌సిగా సాగిన 33 నెలలు నిత్యం ప్రజల్లోనే

మండలి, జెడ్‌పి, ప్రభుత్వ సమావేశాల్లో ప్రజాగళం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఆఖరిశ్వాస వరకూ ప్రజాపోరాటాలే ఊపిరిగా ముందుకు సాగారు. సాబ్జీ మృతికి కొద్ది నిముషాల ముందు సైతం ఆయన కైకలూరు, ఆకివీడులోని అంగన్‌వాడీ ఉద్యోగుల ఆందోళనల్లో పాల్గొన్నారు, భీమవరంలో జరుగుతున్న ఆశాల ఆందోళనలో పాల్గొనేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఉద్యోగ, ఉపాధ్యాయులనే కాకుండా బడుగు జీవులను సైతం శోకసంద్రంలో ముంచెత్తింది. ఆయనతో ఉన్న స్నేహాన్ని, ఆయన చేసిన సహాయాలను, కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచిన తీరును గుర్తు చేసుకుంటూ అంతా తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. సాబ్జీ ఉపాధ్యాయ నేత నుంచి 2021 మార్చి 14న జరిగిన ఉభయగోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిచి ప్రజాజీవితంలోకి అడుగుపెట్టారు. ఎంఎల్‌సి గెలిచిన తర్వాత నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తూనే ఉన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో జరిగే ఆందోళనల్లో ఆయన ప్రత్యక్షంగా పాల్గొని మద్దతుగా నిలిచేవారు. జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ప్రతి ఆందోళనలో ఆయన భాగస్వామిగా ఉన్నారు. సిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున జరిగిన ఆందోళనలో ఎంఎల్‌సిగా సాబ్జీ పాత్ర గురించి ఎంతచెప్పినా తక్కువే. ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రతి సమస్యను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా, ఆందోళనలు, నిరసనల్లో కార్యక్రమంలో ప్రత్యేక్షంగా పాల్గొని తనదైన శైలిలో పోరాటం జరిపేవారు. వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలురైతుల పోరాటాల్లో భాగస్వాములయ్యారు. ఏలూరులో డిగ్రీ కాలేజీ భవనాల నిర్మాణంపై విద్యార్థుల పోరాటానికి, ఎయిడెడ్ పాఠశాలల మూసివేతపై చేపట్టిన ఆందోళనల్లో, స్కూళ్ల విలీనం సందర్భంగా చేపట్టిన నిరసనల్లోనూ, ఇలా ఏ ప్రజాసమస్యపై ఆందోళన, నిరసన సాగిన ఎంఎల్‌సి సాబ్జీ అక్కడకు చేరుకుని తన గళం వినిపించేవారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లోనూ, ఏలూరు నగరపాలకసంస్థలో, కలెక్టరేట్‌లో జరిగే సమీక్ష సమావేశాల్లోనూ ప్రజా సమస్యలపై తనదైన శైలిలో సమస్యను ప్రస్తావించేవారు. ఆర్థిక స్తోమత లేక చదువుకునేందుకు ఇబ్బంది పడుతున్న అనేక మంది పేదవిద్యార్థులకు అండగా నిలిచారు.

నేడు సాబ్జీ అంత్యక్రియలు

ప్రజల సందర్శనార్థం ఇండోర్ స్టేడియంకు తరలింపు

తరలిరానున్న ప్రముఖులు, సంఘాల నేతలు

ఏలూరు ప్రతినిధి: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి, ఉపాధ్యాయ ఉద్యమనేత షేక్ సాబ్జీ భౌతికకాయానికి ఆదివారం ఏలూరులో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ వద్ద శుక్రవారం రోడ్డుప్రమాదంలో సాబ్జీ మృతి చెందిన సంగతి తెలిసిందే. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం అదే రోజు రాత్రి ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపర్చారు. సాబ్జీ కుమార్తె ఆస్రిఫా అమెరికా నుంచి ఆదివారం ఉదయం రానున్నారు. దీంతో సాబ్జీ అంత్యక్రియలకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటలకు ఆశ్రం ఆసుపత్రి నుంచి సాబ్జీ భౌతికకాయాన్ని ఏలూరులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయానికి తీసుకువస్తారు. అక్కడ కొద్దిసేపు ఉంచి, అనంతరం ప్రజల సందర్శనార్థం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఇండోర్ స్టేడియానికి తీసుకెళ్తారు. అక్కడ నుంచి సాబ్జీ స్వగృహానికి తరలించి కొద్దిసేపు అక్కడ ఉంచుతారు. అనంతరం అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. సత్రంపాడు, శాంతినగర్, కొత్తబస్టాండ్, ఫైర్ స్టేషన్, జ్యూట్‌మిల్లు వంతెన మీదుగా పడమరవీధిలోని శ్మశానవాటిక వరకూ అంతిమయాత్ర సాగనుంది. అంతిమ వీడ్కోలులో పలువురు ప్రముఖులు పాల్గొనున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతోపాటు సిపిఎం రాష్ట్ర నాయకులు, వివిధ పార్టీల, సంఘాల నేతలు, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి వి.బాల సుబ్రమణ్యం, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జిల్లా అధికారులు సాబ్జీ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించనున్నారు. సాయంత్రం మూడు గంటలకు యుటిఎఫ్ కార్యాల యంలో సంతాప సభ నిర్వహించనున్నారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్య క్రియలు నిర్వహించాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఉత్తర్వులు జారీ చేయడంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఎంఎల్‌సి సాబ్జీ మృతి తీరనిలోటు

సంతాప సభల్లో వక్తలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతి తీరనిలోటని పలువురు నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో షేక్ సాబ్జీ సంతాప సభ స్థానిక ఎంఎంకెఎన్ఎం హైస్కూల్లో శనివారం సాయంత్రం జరిగింది. సభకు యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కె.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. సభలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, సీనియర్ నాయకులు వలవల శ్రీరామమూర్తి, పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే, యర్రా అజయ్, జిల్లా నేతలు జి.లక్ష్మీనారాయణ, పి.క్రాంతికుమార్, ఎంవి.రాజశేఖర్, పిల్లి శ్రీనివాసరావు, జి.ప్రకాష్‌రావు, ఎస్.రాంజీకుమార్, కె.త్రినాథ్, జి.శ్రీనివాసరావు, డి.క్షేమమూర్తి, ఎంఇఒలు జి.వీరాస్వామి, గంగాధరశర్మ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అవిశ్రాంత పోరాటం చేసిన ఎంఎల్‌సి షేక్ సాబ్జి మృతి తీరనిలోటని యుటిఎఫ్ నాయకులు అన్నారు. శనివారం సాయంత్రం యుటిఎఫ్ భవనంలో మండల అధ్యక్షులు ఎవి.మురళీధర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంతాప సభలో పలువురు నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నేతలు ఎన్.బుజ్జిబాబు, ఎస్‌కె.జానీ, సిహెచ్.శ్రీనివాస్, కె.బ్రహ్మయ్య, శేషగిరి, కె.గోపీ, కెఎన్‌వి.సుజాత, ఎం.పద్మజ పాల్గొన్నారు.

ఆకివీడు: ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతి తీరనిలోటని పలువురు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో ఉపాధ్యాయులు శనివారం సంతాప సభ నిర్వహించారు. తొలుత సాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోతురాజు, ఉపాధ్యాయులు తాలాడి వెంకటేశ్వరరావు, రామశేషు, తోట వెంకటేశ్వరరావు, ముత్యాల వెంకటస్వామి, నాగేశ్వరరావు, గ్లోరీ, పలు ఉద్యమ సంఘాల నాయకులు పాల్గొని సంతాపం ప్రకటించారు.

తాడేపల్లిగూడెం: స్థానిక గూడ్స్‌షెడ్ వద్ద జరిగిన సాబ్జీ సంతాప

పాలకొల్లులో

సభలో తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో చిర్ల పుల్లారెడ్డి, సత్తి కోదండరామిరెడ్డి, తేతలి నాగిరెడ్డి, కర్రి సాయిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఆకుల నారాయణ, అడపా ఆంజనేయులు, వై.కృష్ణ, మద్దాల పుత్రయ్య, ఎస్ఎస్.రెడ్డి, కర్రి సుబ్బిరెడ్డి, బుద్ధాల నాని, గాది వెంకట్రావు, అడ్డగర్ల కృష్ణ, కర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి, గుడిమెట్ల నాగబాబు, కొవ్వూరు రాము, మాదాసు శ్రీను, వి.దానయ్య, తాడి సుబ్బయ్య పాల్గొన్నారు.

తణుకురూరల్: సాబ్జీ మృతి బాధాకరమని పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు కౌరు వెంకటేశ్వర్లు అన్నారు. సాబ్జీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వీరవాసరం: రోడ్డు ప్రమాదంలో ఎంఎల్‌సి షేక్ సాబ్జి మృతి చెందడం చాలా బాధాకరమని యుటిఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు జివివి.రామానుజరావు, సిహెచ్.కుమారబాబ్జి, డి.పుల్లారావు, కె.నాగమునేశ్వరరావు, జివి.రమణ, మద్రగళ శ్రీనివాసరావు, పంపన సాయిబాబు, ఎన్.ప్రసాదుబాబు సాబ్జీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

యలమంచిలి: ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఆకస్మిక మృతి ఉపాధ్యాయ ఉద్యమానికే కాక ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.క్రాంతికుమార్ అన్నారు. సాబ్జీ సంతాప సభ దొడ్డిపట్ల హైస్కూల్‌లో శనివారం రామేశ్వరపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ సాధారణ ఉపాధ్యాయుడు నుండి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వరకు యుటిఎఫ్‌లో సాధారణ కార్యకర్త నుండి అత్యున్నతమైన శాసనమండలి సభ్యుడు వరకు అచంచలమైన క్రమశిక్షణతో సాబ్జీ పని చేశారన్నారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడటమే కాక ప్రభుత్వ బడిని బలోపేతం చేయడానికి, విద్యారంగ వికాసానికి విశేషంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది యు.అనురాధ, ఎ.శ్రీనివాస్, ఎస్.వెంకట్రామయ్య, జె.ఉమామహేశ్వరరావు, కె.విజయమోహన్, కె.గీతకళ్యాణి, కె.యామిని, ఎ.ఉషారాణి, ఎస్.వెంకటేశ్వరరావు, పి.బాలరాజు, ఎంవి.శివన్నారాయణ, కె.సుబ్బారాయుడు, పి.హేమలత పాల్గొన్నారు.



ఆకివీడులో

భూహక్కుల చట్టం ఉపసంహరించుకోవాలి

ఐలు ఆధ్వర్యాన కలెక్టర్ ప్రశాంతికి వినతి

ప్రజాశక్తి - భీమవరం

కలెక్టర్‌కు వినతి అందిస్తున్న ఐలు నేతలు

ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ (భూహక్కుల చట్టం)ను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి న్యాయవాదులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ డి.రాజగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడారు. భూయజమానులకు, ఆస్తి హక్కుదారులకు ఈ యాక్ట్ వల్ల ఎటువంటి ఉపయోగమూ లేదని, అయితే తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని అన్నారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా తీసుకొచ్చిన ఈ చీకటి చట్టంతో స్థానిక సివిల్ కోర్టుల విచారణ పరిధి లేకుండా చేస్తుందన్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రతి మండలానికి ఒక టైటిలింగ్ అధికారిని నియమించే బదులు మండల కోర్టులు, న్యాయమూర్తులను ఏర్పాటు చేస్తే క్రిమినల్ కేసుల్లో సత్వర న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శైలజ, నేతలు వేణుగోపాల్‌చౌదరి, నగేష్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మణికంఠ, సోమేశ్వరరావు, సాగర్ పాల్గొన్నారు.

ప్రదర్శన ప్రారంభిస్తున్న మంత్రి

తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలను రాష్ట్ర హోం శాఖా మంత్రి తానేటి వనిత శనివారం జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక బుద్దాల కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక తెలుగు సాహిత్య అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్, ఎపి సాహితీ అకాడమీ ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, మాజీ ఎంఎల్ఎ ఈలి నాని, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి పాల్గొన్నారు. కళావేదిక అధ్వర్యంలో ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు- తెలుగు భాష సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా వివిధ కళాకారులతో నిర్వహించిన ర్యాలీలో వాణీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తెలుగుతనం ఉట్టిపడేటట్లుగా తెలుగు తల్లి, భరతమాత, రాణి రుద్రమదేవి, మొల్ల, కవిత్రయం నన్నయ, తిక్కన, ఎర్రన్న వంటి కవుల వేషధారణలతో పాల్గొన్నారు.

పాలకోడేరులో మోకాళ్లపై నిల్చొని, నల్ల రిబ్బన్లు కట్టుకుని అంగన్వాడీల నిరసన

తగ్గేదేలే..!

ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రతిఘటిస్తున్న అంగన్వాడీలు

ప్రభుత్వంతో చర్చలు విఫలం

సమ్మె మరింత ఉధృతం

సమస్యలు పరిష్కరించకపోతే ప్రత్యేక కార్యాచరణకు సిద్ధం

నేడు జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ చిన్నారుల తల్లులకు సమస్యల విన్నపం

ప్రజాశక్తి - భీమవరం

తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మెపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నా వెరవకుండా మొక్కవోని దీక్షతో తమ ఆందోళన వివిధరూపాల్లో సాగిస్తున్నారు. ఐదు రోజులుగా సమ్మె జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకుండా అనూహ్య చర్యలకు దిగడం అందరినీ విస్మయపరుస్తోంది. కేంద్రాల తాళాలు పగులగొట్టమని ఆదేశాలిచ్చిన ప్రభుత్వం ఆపై తాము చెప్పలేదని మాట మార్చింది. మూడుసార్లు యూనియన్లతో ప్రభుత్వం చర్చలు జరిపినప్పటికీ విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే తాము ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధంగా ఉన్నామని అంగన్వాడీ యూనియన్ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతోపాటు చిన్నారుల ఆలనాపాలనా చూసి వారి బంగారు భవిష్యత్తుకు ప్రాథమిక విద్య అందించడంలో అంగన్వాడీలు కీలకపాత్ర పోషిస్తున్నారు. అయితే ఈ కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్వాడీలు అనేక రకాల సమస్యలతో నాలుగేళ్ల నుంచి సతమతమవుతూ ప్రభుత్వానికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఈ నెల 13 నుంచి తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్లారు. జిల్లాలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 70, మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 1500 వరకూ ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ఆయాలు, టీచర్లు కలిపి సుమారు మూడు వేల మంది వరకూ పని చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కేంద్రాలకు తాళాలు వేసి సమ్మె కొనసాగిస్తున్నారు. ఐదు రోజుల నుంచి జిల్లాలో అంగన్వాడీల ఆందోళనలు మిన్నంటాయి. కళ్లకు, నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని, మోకాళ్లపై నిలబడి, నలుపు చీరలు ధరించి, ర్యాలీలు, ప్రదర్శనలు చేసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా ప్రభుత్వంలో కనీసం చలనం లేకుండా సమ్మెను నిర్వీర్యం చేసేందుకు పూనుకుంది. అంగన్వాడీల్లో అలజడి సృష్టించి సమ్మెను విరమింపజేసేందుకు అనేక వికృత చర్యలకు పాల్పడింది. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతను సచివాలయ అధికారులకు అప్పగించే చర్యలకు పూనుకుంది.

జిల్లాలో పాలకోడేరు, ఆచంట, పెనుమంట్ర, ఉండి, పాలకొల్లు, గణపవరం, ఆకివీడు, మొగల్తూరు మండలాల్లో తాళాలను పగలగొట్టి కేంద్రాలను ప్రారంభించారు. అయితే కొన్ని ప్రాంతాల్లో అంగన్వాడీ వర్కర్లు, బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు ప్రతిఘటించారు.

నేటితో డెడ్‌లైన్.. ప్రత్యేక కార్యాచరణకు సిద్ధం

సమ్మె నేపథ్యంలో ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా మూడు గంటలపాటు చర్చలు జరిగినప్పటికీ ఫలితం లేదు. ఇప్పటికే మూడు దఫాలుగా ప్రభుత్వం చర్చలు జరిపినప్పటికీ ప్రభుత్వం పాతపాటే పాడుతుండటంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు అంగన్వాడీలు సిద్ధమయ్యారు. ఈ నెల 17 నాటికి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రత్యేక కార్యాచరణకు దిగుతామని యూనియన్ల నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మాట మార్చిన ప్రభుత్వం

మాట మార్చను.. మడమ తిప్పను అని చెబుతూనే ముఖ్యమంత్రి జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను మరిచారు. ఇదిలా ఉండగానే అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టే పని మానుకోవాలని అధికారులతో చర్చలు సందర్భంగా అంగన్వాడీ సంఘాల నేతలు తేల్చి చెప్పారు. అయితే తాళాలు పగులగొట్టమనే ఆదేశాలు తామివ్వలేదని ప్రభుత్వం మాట మార్చింది. అయితే ప్రభుత్వ ఆదేశాలతో మాత్రం తాళాలు పగులగొట్టే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనిపై ప్రజల నుంచి సైతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సూపర్‌వైజర్లపై తీవ్ర ఒత్తిడి

అంగన్వాడీ కేంద్రాల తాళాలను సచివాలయ అధికారులు దగ్గరుండి పగులగొట్టిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నిచోట్ల అంగన్వాడీలు, చిన్నారుల తల్లిదండ్రులు ప్రతిఘటిస్తున్న నేపథ్యంలో అధికారులు వెనుదిరుగుతున్నారు. అయితే ప్రభుత్వం సరికొత్త పంథాకు తెరలేపింది. అంగన్వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లతో కేంద్రాలు తెరిపించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో సూపర్‌వైజర్లపై అధికారులు తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తున్నారు.

గ్రామస్థాయిలో సమస్యలు విన్నపం

సమ్మెలో భాగంగా అంగన్వాడీలు గ్రామస్థాయిలో సమస్యలు విన్నవించేందుకు సిద్ధమయ్యారు. గ్రామాల్లో ఉన్న అంగన్వాడీలంతా చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలను కలిసి తమ సమస్యలను చెప్పడంతోపాటు ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను కూడా విన్నవించేందుకు సిద్ధమయ్యారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం అంగన్వాడీలు గ్రామస్థాయిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు సన్నద్ధమయ్యారు.

ప్రభుత్వ చర్యలు దారుణం

ఎవికెఎల్‌ఎం.తాయారు, విస్సాకోడేరు సెక్టార్

నాలుగు రోజుల నుంచి సమ్మె చేస్తున్నాం. ప్రభుత్వం కనీసం స్పందించలేదు. సమస్యలు పరిష్కరించాల్సిం దిపోయి దారుణమైన చర్యలకు పాల్పడుతుంది. ఇది సరైంది కాదు. అధికారులతో కేంద్రాల తాళాలు పగులగొడితే సమస్యలు పరిష్కారం కావు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం.

మంత్రి వ్యాఖ్యలు సరికాదు

వి.విజయలక్ష్మి, గరగపర్రు సెక్టార్

ప్రభుత్వ ఉద్యోగం పేరుతో మాకు సంక్షేమ పథకాలు నిలిపివేయడం అన్యాయం. ఇతర రాష్ట్రాల్లో అంగన్వాడీలకు పెద్దపీట వేస్తున్నారు. ఇక్కడ మాత్రం సమస్యలు పరిష్కరించకుండా సామరస్యంగా సమ్మె చేస్తుంటే బాధ్యత గల మంత్రి చేసిన వ్యాఖ్యలు సరైనవి కావు. మంత్రి క్షమాపణ చెప్పి సమస్యలు పరిష్కరించే విధంగా ఆలోచన చేయాలి.

తాడోపేడో తేల్చుకునే వరకూ కదిలేది లేదు

ఎం.కనకదుర్గ, గరగపర్రు సెక్టార్

ఎన్నో ఏళ్ల నుంచి అంగన్వాడీ వర్కర్‌గా పని చేస్తున్నాను. అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ఏ ఒక్క సమస్య పరిష్కారం కాకపోవడం కాదుగదా, కనీసం హామీలు కూడా అమలు జరగలేదు. తాడోపేడో తేల్చుకునే వరకూ సమ్మె విరమించేది లేదు.

గొంతు నొక్కే ప్రయత్నం మానుకోవాలి

ఎం.విమల, పాలకోడేరు సెక్టార్

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లేవు. 2012 నుంచి జీతాలు పెంచలేదు. 2017 నుంచి డిఎలు చెల్లించలేదు. కనీస వేతనాలు లేవు. సమస్యలపై మాట్లాడుతుంటే ప్రభుత్వం గొంతు నొక్కుతుంది. ఐదు రోజులుగా ఇక్కడే గడుపుతున్నా కనీసం పట్టించుకున్న నాధుడే లేడు.

ధరలో కోత.. రైతుకు వాత..!

రంగుమారిన ధాన్యం కొనుగోలుకు ఆదేశాలివ్వని ప్రభుత్వం

అయినకాడికి అమ్ముకుంటున్న అన్నదాత

కిలోల లెక్కన కోత విధిస్తున్న వ్యాపారులు

రబీ పనుల నేపథ్యంలో వేగంగా మాసూళ్లు

తక్కువగా లెక్కించినా ఎకరాకు రూ.ఐదు వేల వరకూ నష్టం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రంగుమారిన ధాన్యం అమ్మకాల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం అధికారికంగా ఇప్పటి వరకూ ఎటువంటి ఆదేశాలూ విడుదల చేయలేదు. దీంతో తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని రైతులు అయినకాడికి తెగనమ్ముకుంటున్న పరిస్థితి రెండు జిల్లాల్లోనూ నెలకొంది. కేజీల లెక్కన కోత విధిస్తున్నప్పటికీ దిక్కులేని పరిస్థితుల్లో రైతులు ధాన్యం వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో కనీసంగా లెక్కించినా ఎకరాకు రూ.ఐదువేల వరకూ నష్టపోతున్నట్లు రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. తుపాను వచ్చేనాటికి దాదాపు లక్షా 60 వేల ఎకరాల్లో రైతులు మాసూళ్లు పూర్తి చేశారు. ఇంకా రెండు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు కోత కోయలేదు. తుపాను దెబ్బకు మాసూళ్లు చేసిన ధాన్యపు రాశులు తడిచి ముద్దవ్వగా, మాసూలు చేయని పొలాలు నేలనంటి నీటిలో నానిపోయాయి. దీంతో ధాన్యం రంగుమారి, మొలకలు వచ్చాయి. తుపాను వెళ్లిపోయి వారాలు గడుస్తున్నా రంగుమారిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఆదేశాలు విడుదల చేయలేదు. రంగుమారిన ధాన్యానికి సంబంధించి శాంపిళ్ల సేకరణపై కేంద్ర బృందం గురువారం జిల్లాలో హడావుడి చేసింది. రైతులతో కనీసం మాట్లాడకుండా మండలానికి ఒక ధాన్యం శాంపిల్ తీసుకుని వెళ్లిపోయారు. రబీ సాగుకు సంబంధించి ఇప్పటికే నారుమడులు ఆలస్యమయ్యాయి. దీంతో వెంటనే నారుమడులు వేసేందుకు రైతులు హైరానా పడుతున్నారు. ఈ క్రమంలో ఖరీఫ్ మాసూళ్లు వేగంగా చేస్తున్నారు. అయితే రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయపోవడంతో రైతులకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. దీంతో ఆఫ్‌లైన్‌లో మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో అయినకాడికి అమ్ముకుంటున్నారు. తేమ 17 శాతంకంటే ఎక్కువ ఉంటే బస్తాకు కిలో ధాన్యం తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో బస్తాకు నాలుగైదు కిలోలు రైతులు నష్టపోతున్నారు. రంగుమారిన ధాన్యానికి సంబంధించి మిల్లర్లు ఎంత చెబితే అంతన్నట్లు పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రంగుమారిన ధాన్యం ఎక్కువగా వస్తోంది. కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దెబ్బతిన్న రైతులను ఆదుకోవడం అంటే ఇదేనా అంటూ అన్నదాత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు.

17 శాతం తేమ వచ్చినా కొనుగోళ్లు ఆలస్యమే

రైతుభరోసా కేంద్రంలో తేమ 17 శాతమే వచ్చినప్పటికీ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం లేదు. మరో రెండు రోజులు ఆరబెట్టాలంటూ రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. ధాన్యం సంచుల్లో పట్టిన తర్వాత కూడా ధాన్యం తీసుకెళ్లకుండా రోజుల తరబడి ధాన్యం కళ్లాల్లోనే ఉంచుతున్నారు. గడిచిన రెండు రోజులుగా వాతావరణం మబ్బుగా ఉంటుంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే తుపాను కోలుకోలేని దెబ్బతీసింది. వర్షం కురిసి ఉన్న ధాన్యం కూడా తడిస్తే ఏం చేయాలంటూ రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రంగుమారిన ధాన్యం కొనుగోలుకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఉండిలో చెవిలో పువ్వు పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పోడూరులో మోకాళ్లపై నిలబడి అంగన్‌వాడీల నిరసన

అత్తిలిలో..

అశ్రు నివాళి అర్పించి.. సమరశంఖం పూరించి..

సమ్మెలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీకి నివాళులర్పించిన అంగన్‌వాడీలు - అనంతరం చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్న నిరసన

ప్రజాశక్తి - భీమవరం

అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం కనీసం పట్టించుకోకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ అన్నారు. శనివారం భీమవరం, పాలకోడేరులో అంగన్‌వాడీలకు రాయ్ సంఘీభావం తెలిపి నోటికి నల్ల రిబ్బను కట్టుకొని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపి మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించి, అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ జ్యోతికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, విజయలక్ష్మి, ఇంజేటి శ్రీనివాస్, సిహెచ్.వెంకటేశ్వరరావు, గణేష్ పాల్గొన్నారు.

టీచర్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతి తీరని లోటని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ అన్నారు. భీమవరం, పాలకోడేరు అంగన్‌వాడీల సమ్మెలో సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాయ్, అంగన్‌వాడీ హెల్పర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కళ్యాణి, సహాయ కార్యదర్శి హసీనా బేగం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బి.వాసు, ఎం.ఆంజనేయులు, యూనియన్ నాయకులు విజయలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెంటపాడు : అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటానికి అంగన్‌వాడీలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శిబిరం నుంచి ర్యాలీగా వెళ్లి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు మురళీకృష్ణ, జిల్లా నాయకురాలు అజయ్ కుమారి మాట్లాడారు. కార్యక్రమంలో పెనగంటి దుర్గా అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆకివీడు : ఏ ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం లేదని, విజయం మనదేనని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి అన్నారు. అంగన్‌వాడీల దీక్ష ఐదో రోజు కొనసాగింది. శనివారం అంగన్‌వాడీల దీక్ష వద్ద ఆమె మాట్లాడారు. ఆదివారం సెలవురోజు అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులతో సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పైడేశ్వరి, కృష్ణకుమారి, కనకదుర్గ, లక్ష్మి పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : అంగన్‌వాడీ కార్యకర్తల రిలే నిరాహార దీక్షలు ఐదో రోజు కొనసాగాయి. ముందుగా అంగన్‌వాడీలు ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు అజయ్‌కుమారి, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఏలియమ్మ, సివిల్ సప్లై హమాలీలు సంఘీభావం తెలిపారు.

ఉండి : అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం ప్రకటించడానికి భీమవరం వస్తున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమని సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్, అంగన్‌వాడీలు అన్నారు. ఈ సందర్భంగా షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ధనికొండ శ్రీనివాస్, అంగన్‌వాడీ మండల అధ్యక్షులు చైతన్య మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొట్టాడ వెంకటేశ్వరరావు, మోపిదేవి రాము, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మొగల్తూరు : అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని స్టేట్ కో- ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల సోనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదో రోజు కొనసాగిన దీక్షా శిబిరాన్ని యూనియన్ సభ్యులు సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, మొగల్తూరు సొసైటీ కార్యదర్శి కొత్తపల్లి గోవిందరాజు, సభ్యులు మాదాసు శేషగిరి, పైడిమర్రి సురేష్, చింతపల్లి శ్రీను పాల్గొన్నారు.

ఆచంట : అంగన్‌వాడీ కేంద్రాలకు వేసిన తాళాలు పగలగొట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చారని చెబుతున్నారు గాని కలెక్టర్‌ను మీరు సస్పెండ్ చేయగలరా అని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ సవాల్ విసిరారు. స్థానిక కచేరీ సెంటర్లో అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన కొనసాగింది. ఈ కార్యక్రమానికి పితాని సంఘీభావం తెలిపి, సిఐటియు నాయకులతో దీక్షా శిబిరంలో కూర్చుని నిరసన తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు బీరా నరసింహమూర్తి, తమ్మినేడి ప్రసాద్, ప్రభాకర్, కేతా మురళి పాల్గొన్నారు. కచేరీ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహశీల్దార్ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మైలే విజయలక్ష్మి, పుడక నాగలక్ష్మి, శ్రీదేవి సత్యవతి సరోజినీ పాల్గొన్నారు.

ఉండి : ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా తగ్గేదే లేదంటూ అంగన్‌వాడీలు ఐదో రోజు చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.చైతన్య, డి.సత్యవేణి మాట్లాడారు. సిఐటియు మండల అధ్యక్షుడు కార్యదర్శులు ధనికొండ శ్రీనివాస్, కొట్టాడ వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపారు.

తణుకు రూరల్ : అంగన్‌వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేయాలనుకుంటే పోరాటం ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ హెచ్చరించారు. కోర్టు వద్ద చేపట్టిన దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. సమ్మెకు సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, గుబ్బల వెంకటేశ్వరరావు, సొసైటీ ఉద్యోగులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, శ్రీనివాస్ సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గార రంగారావు, వసంత, ప్రమీల, జ్యోతి, మధు షీల, ఎన్.కనకదుర్గ పాల్గొన్నారు.

గణపవరం : ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మెకు టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇందుకూరి రామకృష్ణంరాజు, కూసంపూడి సురేంద్రరాజు, పల్లి వెంకటేశ్వరరావు, శ్రీనివాసు పాల్గొన్నారు.

పెనుగొండ : అంగన్‌వాడీ సెంటర్ల తాళాలను అధికారులు పగలగొట్టారు. ఈ మేరకు అంగన్‌వాడీలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండిఒ శ్రీనివాస్ దొర, తహశీల్దార్ ఎస్.గురుమూర్తి రెడ్డితో అంగన్‌వాడీల పెనుమంట్ర ప్రాజెక్టు లీడర్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు పాల్గొన్నారు.

పాలకొల్లు : ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతి కార్మిక, ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తీవ్ర సంతాపం తెలిపింది. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళన కొనసాగింది. ఈ సందర్భంగా సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, పురుషోత్తం, సీనియర్ ఉపాధ్యాయుల నేత వలవల శ్రీరామ్మూర్తి, డి.అజయ్, అంగన్‌వాడీ నేతలు శ్రీదేవి, నాగలక్ష్మి, సత్యవతి, ఝాన్సీ, పద్మావతి పాల్గొన్నారు.

పోడూరు : తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఐదో రోజు అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. దీక్షకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటీయు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి.ప్రసాద్, ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడు కుమారి, వైట్ల రాణి, బి.వెంకటరావు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : అంగన్‌వాడీల సమ్మె ఐదో రోజు కొనసాగింది. అంబేద్కర్ సెంటర్లో దీక్షను కొనసాగించి ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎర్రంశెట్టి బాబు, గుర్తుల బలిచక్రవర్తి, సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, అంగన్‌వాడీ నాయకులు పాల్గొన్నారు.

యలమంచిలి : సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ చేపట్టిన సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ సునీల్ కుమార్, ఎంపిడిఒ త్రిశూలపాణికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రజని, పద్మశ్రీ, దేవి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు దీన స్వరూపారాణి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు సిఐటియు పట్టణ కమిటీ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, యూనియన్ తాడేపల్లిగూడెం ప్రాజెక్టు అధ్యక్షురాలు దీన స్వరూపరాణి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు. అలాగే సమ్మెకు ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వరప్రసాద్ మద్దతు తెలిపారు.

అత్తిలి : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. సమ్మెకు జనసేన నేత విడివాడ రామచంద్రరావు మద్దతు తెలిపారు. అలాగే పి.సాయిరామ్, ఎ.దుర్గారావు, ఎన్‌వి.దుర్గ, కె.అఖిల్, జి.మణిరామ్‌కుమార్, పాల్గొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు మద్దతు తెలిపారు. అనంతర్ సాబ్జీ మృతికి సంతాపం తెలిపారు.

పెనుగొండ : ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల మొండివైఖరి అవలంబిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ముందుగా అంగన్‌వాడీలు షేక్ సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. సమ్మెకు గోపాలన్ మద్దతు తెలిపి మాట్లాడారు. అలాగే చినమల్లం, దొంగరావిపాలెం, సిద్ధాంతం గ్రామాల సర్పంచులు, యుటిఎఫ్ టీచర్లు సంఘీభావం తెలిపారు.

వీరవాసరం : అంగనవాడీల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం తాళాలు బద్దలు కొట్టి వికృత చేష్టలకు పాల్పడుతోందని, దీని పర్యావసనాలు తీవ్రంగా ఉంటాయని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. అంగన్‌వాడీల సమ్మె శిబిరం వద్దకు శనివారం సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, రైస్ మిల్లర్స్ వర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు బి.వాసుదేవరావు వచ్చి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, పి.నాగరత్నం, సత్యవతి, నిర్మల, వై.వెంకటలక్ష్మి, ఎస్తేరు, శాంతి కుమారి, కె.సత్తిబాబు పాల్గొన్నారు.

వెనుదిరిగిన అధికారులు

మొగల్తూరు : మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టేందుకు యత్నించిన అధికారులను చిన్నారుల తల్లిదండ్రులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. శనివారం ఆయా కేంద్రాలను సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో నడిపేందుకు అధికారులు ప్రయత్నించారు. ఆయా కేంద్రాల తాళాలు పగలగొట్టేందుకు వచ్చిన అధికారులను చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు అడ్డుకోవడంతో వారు వెనుతిరిగారు.

అన్నదాతలను ఆదుకోవాలి

మాజీ మంత్రి కొత్తపల్లి

ప్రజాశక్తి - మొగల్తూరు

అన్నదాతలను ఆదుకోవడంలో ప్రభుత్వం అలసత్వం వహించకూడదని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. శనివారం సాయంత్రం ముత్యాలపల్లి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ రావడంతో రైతులు నష్టపోయారని, ఇది బాధాకరమని తెలిపారు. ప్రభుత్వం వరిచేలకు నీరు 15 రోజులు ఆలస్యంగా అందించడం వల్ల పంటగా చేతికి రావడం ఆలస్యమైందని, దీనికితోడు తుపాను రావడంతో రైతులకు నష్టం వాటిల్లిందని తెలిపారు. అనంతరం జాతీయ రహదారిపై అన్నదాతలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ముక్కు పుల్లయ్య, మెట్టు రాజేష్, క్రరి వీరాస్వామి, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

POTHU HARISCHANDRA PRASAD అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.05-02-2014న L6995222 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరుచేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.05-12-2023 న ఏనుగువానిలంక గ్రామం నుండి యలమంచిలి గ్రామం వెళుచుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

POTHU HARISCHANDRA PRASAD
S/o. Pothu Krishna
D.No. 1-49, Main Road, Yenuguvani Lanka
Yelamanchili Mandal, W.G.Dt. A.P.

మహారాజశ్రీ తణుకు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 271/2020

వాది: ఇందుగపల్లి శ్రీనివాసరావు

మరియు

ప్రతివాది: నుక్కల భీమశంకర్, S/o. రామారావు, సా॥ డో.నెం. 11-1-77, పంజా సెంటర్, మసీదు వద్ద, నరసాపురం.

వాది చేయించిన ప్రకటన

పై నెంబరు దావాను, వాది ప్రామిశరీ బాకీ గురించి 1వ ప్రతివాది అయిన నుక్కల భీమశంకర్, మీపైన పై నెంబరు దావాను దాఖలు చేయగా, 1వ ప్రతివాది అయిన మీరు శ్రీ కోర్టు వారి దావా సమనులను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచూ ఆలస్యం చేయుచున్నందున ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు దావా సమన్సు అమలు జరుగు నిమిత్తం **ది. 05-01-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు గాని, మీ తరపు అడ్వకేట్ వారు గాని స్వయముగా హాజరయ్యి మీ ఆక్షేపణలను తెలియపరచుకొనవలెను. లేనిచో మీపైన పరోక్షముగా తీర్మానించబడునని తెలియపరచడమైనది.

వాయిదా తేది: 05-01-2024

జి.ఎన్.వి.ఎస్.సిహెచ్.వై.ప్రసాద్
తణుకు వాది తరుపున అడ్వకేట్
15-12-2023 తణుకు, సెల్:7799235999

(By Court Order)

మహారాజశ్రీ చీరాల సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

E.P.No.21/2023
in
O.S.No. 104/2018

Between:-
గ్రంధి రమేష్ బాబు తండ్రి బాల సుబ్రహ్మణ్యం వయసు 43 సం.లు, R/o డోర్ నెం. 15-18-5/2, పాపరాజుతోట, చీరాల .....D.H.R

మరియు

1) జంగం శ్రీలత, భర్త డానియెల్ వయసు 57 సం.లు, గృహిణి.
2) జంగం షైనీ ప్రవీణ, తండ్రి డానియెల్ వయసు 37 సం.లు, డిపెండెంట్,
3) జంగం స్మైల్ ప్రియాంక, తండ్రి డానియెల్,వయసు 35 సం.లు, డిపెండెంట్, పై తెల్పిన 1 to 3 వార్ల నివాసం Door No.25-1023 నవ్య రెసిడెన్షియల్ అపార్టుమెంటు ప్రక్కన నరసింహారావుపేట, ఫైర్‌స్టేషన్‌రోడ్, ఏలూరు-టౌన్ & డిస్ట్రిక్ట్ ..J.D.RS

పైనంబరు E.Pని పై తెల్పిన D.H.R. ఆర్డర్ 21 రూలు 52 ఆఫ్ సి.పి.సి క్రింద J.D.Rs పైదాఖలు చేసిన తరువాత, పై నంబరు E.P.లో J.D.Rs.కు ఎన్నిసార్లు నోటీసులు పంపినను జారీకానందున, కోర్టు వారి ఆదేశాల మేరకు తెలియ జేయునదేమనగా పైనెంబర్ E.P.లో మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల ది.02-01-2024న ఉదయం గం.10-30 ని. లకు పై తెల్పిన కోర్టులో మీరు స్వయముగా కానీ లేక మీ అడ్వకేట్ ద్వారాకాని హాజరై మీకోపణలు కోర్టువారికి తెల్పు కోవలసినది. లేనిచో పైనంబరు E.P.ని మీపరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియ జేయటమైనది.

చీరాల
ది : 15-12-2023 ఇట్లు
కొణికి శేషగిరిరావు
డి.హెచ్.ఆర్.తరపు అడ్వకేట్
కొట్ల బజార్, చీరాల

దేశంలోనే సిఎం జగన్ ఆదర్శం : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇచ్చిన మాట నిలబెట్టుకునే కుటుంబం వైఎస్ఆర్ కుటుంబమని, ఆయన అడుగుజాడల్లో ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పయనిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన ప్రజల అభివృద్ధి కోసం రేయింబవళ్లు పనిచేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరిగే విధంగా నవరత్నాలను అమలు చేస్తున్నారన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - పోడూరు

మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను శనివారం ఆచంట రిటర్నింగ్ ఆఫీసర్ వి.స్వామినాయుడు పరిశీలించారు. పోడూరు, కవిటం, జగన్నాథపురం పండితవిల్లూరు, మినిమించిలిపాడులో ఆయన పర్యటించి పోలింగ్ కేంద్రాలను తనిఖీచేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద మరుగుదొడ్ల సదుపాయం, వికలాంగులకు ర్యాంపులు, తదితర సదుపాయాలు సక్రమంగా ఉన్నదీ, లేనిది ఆయన పరిశీలించి రెవెన్యూ అధికారులకు సూచనలిచ్చారు. ఆయన వెంట తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు, డిటిడి.రాజేష్, ఆర్ఐ కె.రాంబాబు, వి.త్రిమూర్తులు, విఆర్ఒలు పాల్గొన్నారు.

ఘనంగా శివరామరాజు పుట్టినరోజు

ప్రజాశక్తి - ఉండి

మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఎంపిటిసి సభ్యురాలు కునుకు రమాదేవి, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు కునుకు శ్రీనివాస్ అన్నారు. చిన వంతెన సెంటర్లో మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కునుకు రమాదేవి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెద్దింటి బాబు, దవిలి శ్రీను, గోవాడ శేషు, బైర్రెడ్డి పైడియ్య, పొట్నూరి అప్పారావు పాల్గొన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి పిల్లలకు పెన్నులు, చాక్లెట్లు పంపిణీ చేశారు.

ఎన్నికల ఓటింగ్ యంత్రంపై అవగాహన

ప్రజాశక్తి - ఉండి

ఓటు వేసి అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు డెమో ఇవిఎంలు ఉపయోగపడతాయని జిల్లా పంచాయతీ అధికారి, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జివికె.మల్లికార్జునరావు అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ఓటింగ్ యంత్రంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లకు నమూనా ఓటింగ్ యంత్రంపై కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ఫ్యాడ్‌లు పనిచేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఏడిద శ్రీనివాస్, ఇన్‌ఛార్జి మండల అభివృద్ధి అధికారి అందే కొండలరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - పోడూరు

కవిటం సెంటర్ నుంచి పైడవ మీదుగా రూ.3 కోట్లతో నిర్మించే పెనుమదం వెళ్లే రహదారి విస్తరణ పనులను శనివారం ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బి ఎఇ మూర్తికి సూచించారు. ఎంఎల్ఎ వెంట జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, సర్పంచి శెట్టిబత్తుల సువర్ణరాజు, వైస్ ఎంపిపి ఇందుకూరి సీతారామ రాజు, చేకూరి సూరిబాబు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - ఆకివీడు

అంగన్‌వాడీల ఉద్యమానికి బాసటగా నిలిచిన ఉపాధ్యాయ సంఘాల ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మరణాన్ని నమ్మలేకపోయామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిఐటియు నాయకులు డి.కళ్యాణి అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.తవిటినాయుడు, షేక్ వలీ, అంగన్‌వాడీ నాయకులు కనకదుర్గ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

గణపవరం : షేక్ సాబ్జీ అకాల మరణం ప్రజా ఉద్యామాలకు తీరనిలోటని సిఐటియు మండల కమిటీ నాయకులు బి.రామకోటి అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమ్మెలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

తణుకు రూరల్ : ఎంఎల్‌సి షేక్ సాబ్జీకి అంగన్‌వాడీలు నివాళులర్పించారు. సిఐటియు నాయకులు ప్రతాప్, ఎఐటియుసి నాయకులు నాగరాజు, సొసైటీ ఉద్యోగులు నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్ మాట్లాడారు. సాబ్జీ ఆశయ సాధనకోసం పనిచేస్తామని తెలిపారు.

మొగల్తూరు : ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతికి యుటిఎఫ్ సీనియర్ నాయకులు పొదిలి కృష్ణమూర్తి, మండల నాయకులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆచంట : ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతి బాధాకరమని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేతా వెంకటేశ్వరరావు అన్నారు. కచేరీ సెంటర్లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కార్యదర్శి కె.కాశీ విశ్వనా థం, సిఐటియు మండల కార్యదర్శి వర్ధిపత్తి అంజిబాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డి.కోటేశ్వరరావు, సిపిఎం నాయకులు పి.మోహన రావు, టి.సత్యనారాయణ, సిర్రా నరసింహమూర్తి, టి.బుల్లబ్బాయి, సిర్రా విఘ్నేశ్వరుడు పాల్గొన్నారు.

ఆలమూరులో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

ఆచంట (పెనుమంట్ర) : ఆలమూరులో దళితులకు శ్మశానవాటిక లేకపోవడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, తహశీల్దార్ దండు అశోకవర్మతో కలిసి ఆయన దళితవాడలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ దళితవాడల్లో శ్మశానవాటికకు సంబంధించి రెండెకరాలు ఇవ్వాలని స్పష్టంగా జిఒ ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆలమూరు గ్రామస్తులకు శ్మశానవాటిక కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. లేకపోతే రానున్న రోజుల్లో గ్రామస్తులతో కలిసి పోరాట ఉధతం చేస్తామని పుష్పరాజ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మేడపరెడ్డి వెంకట రమణ, ఓడూరు సర్పంచి బుర్రా రవికుమార్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర చేనేత విభాగం జనరల్ సెక్రటరీగా పరమేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

రాష్ట్ర చేనేత విభాగ జనరల్ సెక్రటరీగా గొరగనమూడి గ్రామానికి చెందిన వైసిపి నేత బళ్ల పరమేశ్వరరావు నియమితులయ్యారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు ఆదేశాల మేరకు తనను నియమించారని పరమేశ్వరరావు తెలిపారు. పదవికి పూర్తిస్థాయి న్యాయం చేస్తానని తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి : డిపిఒ

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రతి ఒక్కరూ అవగాహనతో ఓటు హక్కును వినియోగించుకోవాలని డిపిఒ మల్లికార్జునరావు సూచించారు. పాలకోడేరులో శనివారం సాయంత్రం ఓటు హక్కు వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ పోలింగ్ సమయంలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా డేవిడ్ రాజు

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి క్రిస్టియన్, మైనార్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బి.డేవిడ్‌రాజును నియమించడం అభినందనీయమని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం పోడూరు మండలం తూర్పుపాలెం ఎంఎల్ఎ కార్యాలయంలో డేవిడ్ రాజును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతమైన పదవిలో నియమించడం వల్ల ఆ పదవిని సద్వినియోగం చేసుకొని అందరికీ ఉపయోగపడేలా సేవ చేయాలన్నారు. కొడమంచిలి గ్రామానికి చెందిన పాస్టర్ బి.డేవిడ్‌రాజును వైసిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు మేడిది జాన్సన్ తెలిపారు. డేవిడ్ రాజు మాట్లాడారు. క్రైస్తవ, మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఎంఎల్ఎను కలిసిన వారిలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, పాస్టర్ తిమోతి రాజు, పోలుమూరి శేఖర్ బాబు పాల్గొన్నారు.

వైసిపి సీనియర్ నేత చిట్టిమోషే మృతి

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట పెదపేటకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు, మాల మహానాడు మాజీ అధ్యక్షులు పీతల చిట్టిమోసే (60) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. మోసే అకాల మృతి పార్టీకి తీరని లోటని శాసన మండలి సభ్యులు కొయ్యే మోషనురాజు, ఎంఎల్ఎ రంగనాథరాజు అన్నారు. శనివారం వారు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

నిర్దోషిబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ట్రస్ట్ అధినేత వెంకట రామరాజు

దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన పందుల నిర్దోషిబాబు ఇటీవల మృతి చెందారు. నిర్దోషి బాబు కుటుంబాన్ని దాట్ల వెంకట రామరాజు పరామర్శించారు. శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ నుంచి ఆ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు మాట్లాడుతూ కాళ్లకూరులో పేద, బడుగు, బలహీనవర్గాల వారికి చేతనైన సహాయం అందిస్తున్నామన్నారు.

పిల్లల పట్ల శ్రద్ధ వహించాలి

పాలకొల్లు : పాలకొల్లులోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఇఒ గుమ్మల వీరస్వామి మాట్లాడారు. పాఠశాల పర్యవేక్షణలో తల్లిదండ్రులు పాత్ర ఎంతో ఉందన్నారు. అనంతరం ప్రగతి పత్రాలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందజేశారు. ప్రతి పిల్లవాడి ప్రగతిని వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్, ఉపాధ్యాయులు త్రిమూర్తులు, శశికళ, భవాని దుర్గ పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ 3వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి, పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం

ఎ.ఎస్.నెం. 4/2023

బిట్వీన్:
వాదులు : అప్పీలేట్ - 1) ఎండి అస్లం పాషా - అప్పిలెంట్
2) ఎండి మొహిద్దీన్ పాష-అప్పిలెంట్
3) ఎండి బాజి మైనుద్దీన్ - అప్పిలెంట్
ప్రతివాదులు : రెస్పాండెంట్స్ : 1) వాసాకా మేరీ పుష్పం
2) వాసాకా సుబ్బారావు

ఆర్డరు తేది : ది.29-11-2023

1వ రెస్పాండెంట్ : వాసాకా మేరీ పుష్పం, భర్త : సుబ్బారావు, డోరు నెం. 15-12-28, పాలూరి వారివీధి, 18వ వార్డు, భీమవరం-534201, పశ్చిమగోదావరి జిల్లా

2వ రెస్పాండెంట్ : వాసాకా సుబ్బారావు, s/o. నరసయ్య, డోరు నెం. 15-12-28, పాలూరి వారి వీధి, 18వ వార్డు, భీమవరం - 534201, పశ్చిమగోదావరి జిల్లా

పై నెంబరు ఎ.ఎస్.నెం. 4/2023లో శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 2వ రెస్పాండెంట్ ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా నోటీసులు పంపిననూ అందుకొనలేదు. సదరు ఎ.ఎస్.నెం. 4/2023లో ది.29-12-2023వ తేదీన వాయిదా అయివున్నది. సదరు తేది ఉదయం 10-30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయి, తమ సంజాయిషీని తెలుపుకోగలరు. లేని యెడల మీపై పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

షేక్ రోషన్, ఎం.ఎ.బిఎల్.,
అడ్వకేట్, భీమవరం, సెల్ : 9441750986
భీమవరం, తేది : 15-12-2023

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814